



# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

రిపోర్టర్లు కావాలి.

9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 280 | జూన్ 7 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


## సోషల్ మీడియాలో రాజకీయ విమర్శలు నేరం కాదు: తెలంగాణ హైకోర్టు తీర్పు!







- ప్రజాస్వామ్యంలో విమర్శించడం ప్రతి పౌరుడి హక్కు
- రాజకీయ అభిప్రాయం వ్యక్తం చేయడాన్ని నేరంగా పరిగణించలేరు
- అభిప్రాయ స్వేచ్ఛను కాపాడటం న్యాయస్థానాల బాధ్యత

**మన దునియా,హైదరాబాద్:జూన్ 06**

ప్రజాస్వామ్యంలో పౌరుల గొంతుకకు పట్టం కడుతూ తెలంగాణ హైకోర్టు ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రభుత్వంపై లేదా రాజకీయ నాయకులపై సోషల్ మీడియాలో విమర్శలు చేసినంత మాత్రాన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం రాజ్యాంగ విరుద్ధమని న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని విమర్శిస్తూ 'ఠ' (ట్విట్టర్)లో పోస్టులు పెట్టారన్న కారణంతో ఒక రాజకీయ కార్యకర్తపై పోలీసులు మూడు వేర్వేరు స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. ఈ కేసులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎన్. తుకారాంజీ ధర్మాసనం ఆ కేసులను కొట్టివేస్తూ పోలీసులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం చేసే పనులను విమర్శించే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుంది. అది రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19(1)(a) భావప్రకటనా స్వేచ్ఛ పరిధిలోకి వస్తుంది.విమర్శనాత్మక పోస్టులు కనిపించగానే

(మిగతా 2వ పేజీలో..)

## సింగరేణిలో భారీ కుంభకోణం.. రూ.1,600 కోట్ల బొగ్గు మాయంపై న్యాయ విచారణకు కేటీఆర్ డిమాండ్

### సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైనట్లు కేటీఆర్ ఆరోపణ

### సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు డిమాండ్

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసి విచారణ కోరిన కేటీఆర్

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (రాజజూ)లో సుమారు రూ. 1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు (కేటీఆర్) సంచలన ఆరోపణలు చేశారు. ఈ భారీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ

(మిగతా 2వ పేజీలో..)



## టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు వీరే... అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు

- తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన
- ముగ్గురి పేర్లను ఖరారు చేసిన టీడీపీ నాయకత్వం
- సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లకు అవకాశం
- అభ్యర్థులను అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు

(మిగతా 2వ పేజీలో..)



## కోటిచెరువు భూమిని వెంటనే వెనక్కివ్వు: పవన్ కల్యాణ్‌పై కవిత ఫైర్

- కోటి చెరువు శిఖం భూమిని పవన్ కబ్జా చేశారన్న కవిత
- తెలంగాణ ప్రభుత్వానికి భూమిని అప్పగించాలని డిమాండ్
- తెలంగాణ కచ్చితంగా తమ జాగీరేనని వ్యాఖ్య

తెలంగాణ రాజకీయాల్లో భూకబ్జాల వ్యవహారం ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎం




పవన్ కల్యాణ్ వర్సెస్ కవితగా మారి సరికొత్త వివాదానికి తెరలేపింది. హైదరాబాద్‌లోని

(మిగతా 2వ పేజీలో..)

## పేదలు చెరువులను ఆక్రమిస్తే అర్థముంది.. ధనికులు కూడా చెరువులను కబ్జా చేస్తే ఏమనాలి?: సీఎం రేవంత్ రెడ్డి

### ప్రభుత్వ ఆస్తులు, జల వనరుల పరిరక్షణకే హైడ్రా ఏర్పాటు అని వెల్లడి


### యువతలో డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ఈగిల్ ఫోర్స్

### రాష్ట్రంలో మరో 5,000 పోలీసు ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్

### హైడ్రా ద్వారా రూ.1 లక్ష కోట్లకు పైగా ఆస్తులను కాపాడినట్లు వెల్లడి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
RNI Number
మన అక్షరం – మన ప్రపంచం

## సింగరేణిలో భారీ కుంభకోణం.. రూ.1,600 కోట్ల బొగ్గు మాయంపై న్యాయ విచారణకు కేటీఆర్ డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి జి. కిషన్ రెడ్డికి కేటీఆర్ ఒక లేఖ రాశారు.సింగరేణిలోని పలు స్టాక్‌యార్డులలో బొగ్గు నిల్వల నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. రికార్డుల ప్రకారం బొగ్గుపై సెస్, ఆదాయపు పన్ను చెల్లించినప్పటికీ, క్షేత్రస్థాయి తనిఖీల్లో నిల్వల మధ్య భారీ వ్యత్యాసం కనిపించిందని వివరించారు. ఈ వ్యవహారం వెనుక బొగ్గును అక్రమంగా తరలించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించిన భారీ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు.ఈ కుంభకోణం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ హస్తం ఉందని, లేదా బాధ్యులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి, కేంద్రంలోని బీజేపీ మంత్రులకు మధ్య లోపాయికారీ సంబంధాలు ఉన్నాయేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అందుకే కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ స్కామ్‌ను బయటపెట్టకుండా ఉండేందుకే తమ పార్టీ నేతలను అరెస్టు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు వీరే... అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు



(మొదటి పేజీ తరువాయి)

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తమ రాజ్యసభ అభ్యర్థులను ఖరారు చేసింది. ముగ్గురు అభ్యర్థులతో కూడిన జాబితాను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శనివారం అధికారికంగా విడుదల చేశారు. జూన్ 18న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ తరఫున సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ బరిలో నిలవనున్నారు.వివరాల్లోకి వెళ్తే, రాజ్యసభ అభ్యర్థులుగా పారిశ్రామికవేత్త సానా సతీష్, ప్రముఖ విద్యావేత్త, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, పార్టీ సోషల్ మీడియా విభాగం ముఖ్య నేతగా ఉన్న చింతకాయల విజయ్‌లను ఎంపిక చేసినట్లు పార్టీ ప్రకటించింది. రానున్న ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై కొంతకాలంగా పార్టీ వర్గాల్లో చర్చలు జరగ్గా, చివరికి అధిష్ఠానం ఈ ముగ్గురి పేర్లను ఖరారు చేసింది.ఈ ముగ్గురిని చంద్రబాబు ఇవాళ తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి స్వయంగా బి-ఫారాలు అందజేశారు. వారు సోమవారం నాడు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ మేరకు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం నుంచి అధికారికంగా పత్రికా ప్రకటన వెలువడింది. కాగా, ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవడం తెలిసిందే. కూటమి పొత్తు ధర్మం ప్రకారం నాలుగు స్థానాల్లో ఒకటి జనసేనకు కేటాయించగా, తమ అభ్యర్థిగా జనసేన పార్టీ లింగమనేని రమేష్ పేరును ఖరారు చేయడం తెలిసిందే.

## సోషల్ మీడియాలో రాజకీయ విమర్శలు నేరం కాదు:

(మొదటి పేజీ తరువాయి)

యాంత్రికంగా కేసులు నమోదు చేయకూడదు. ఆ పోస్టులు కాస్త ఘాటుగా లేదా అసభ్యకరంగా ఉన్నంత మాత్రాన అవి క్రిమినల్ నేరాలు అయిపోవు. గతంలో 'శ్రేయా సింఘాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు చెప్పినట్లుగానే.. కేవలం ఇబ్బందికరంగా ఉన్నాయన్న సాకుతో సోషల్ మీడియా పోస్టులపై కేసులు పెట్టడం చెల్లదు.ఈ తీర్పు ద్వారా స్పష్టమవుతున్నదేమిటంటే.. మీ అభిప్రాయాలను నిర్భయంగా చెప్పవచ్చు. అయితే, ఆ విమర్శలు కేవలం అభిప్రాయ వ్యక్తీకరణకు పరిమితం కావాలి తప్ప, అవి ప్రత్యక్షంగా హింసను ప్రేరేపించేవిగా లేదా దేశ భద్రతకు ముప్పు కలిగించేవిగా ఉండకూడదు.అధికారంలో ఉన్న వారు విమర్శలను స్వీకరించాలే తప్ప, చట్టాన్ని అడ్డుపెట్టుకొని గొంతు నొక్కే ప్రయత్నం చేయకూడదని హైకోర్టు తీర్పు మరోసారి గుర్తుచేసింది.

## పేదలు చెరువులను ఆక్రమిస్తే అర్థముంది.. ధనికులు కూడా చెరువులను కబ్జా చేస్తే ఏమనాలి?: సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన హైడ్రా, ఈగిల్ ఫోర్స్ విభాగాలు నేడు దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఈ ఏజెన్సీలు పనిచేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. శనివారం బెంగళూరులో నిర్వహించిన 'ది హిందూ హడిల్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ అంశాలపై ప్రసంగించారు.చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను అక్రమ కట్టడాల నుంచి కాపాడేందుకు 2024 జులైలో హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)ను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సీనియర్ ఐపీఎస్ అధికారుల నేతృత్వంలో, రిటైర్డ్ ఆర్మీ సిబ్బందితో కలిపి సుమారు 3,000 మంది సిబ్బందితో పనిచేస్తున్న ఈ ఏజెన్సీ, ఇప్పటివరకు రూ. 1 లక్ష కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడిందని తెలిపారు. "గతంలో పలుకుబడి ఉన్నవారు విల్లాలు, ఫామ్‌హౌస్‌ల కోసం జలవనరులను కబ్జా చేసేవారు. ఇప్పుడు ఆ సాహసం ఎవరూ చేయడం లేదు" అని రేవంత్ రెడ్డి వివరించారు. పేదలు చెరువులను కబ్జా చేస్తే అర్థముంది.. కానీ ధనికులు కూడా చెరువులను ఆక్రమిస్తే ఏమనాలి? అంటూ వ్యాఖ్యానించారు.అదే సమయంలో, యువతను లక్ష్యంగా చేసుకున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఈగిల్ ఫోర్స్ పనితీరును ఆయన ప్రశంసించారు. దేశంలోనే అత్యంత సమర్థవంతమైన యాంటీ-నార్కోటిక్స్ విభాగాల్లో ఇది ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు.

పాలనాపరమైన ఇతర అంశాలు

తమ ప్రభుత్వం గత 15 నెలల్లో కాలంలోనే 67,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, త్వరలోనే మరో 5,000 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. రైతు రుణమాఫీ, మహిళా స్వయం సహాయక బృందాలకు ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక కార్యక్రమాలను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపు కల్పించామని, తద్వారా ప్రభుత్వ రాబడి తగ్గినా పర్యావరణ హితానికి తాము ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన వెల్లడించారు.

## కోటిచెరువు భూమిని వెంటనే వెనక్కివ్వు: పవన్ కల్యాణ్‌పై కవిత ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

'కోటిచెరువు' శిఖం భూమిని పవన్ కల్యాణ్ కబ్జా చేశారంటూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని పార్టీ ఆఫీస్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. పవన్ గనుక ఆ భూమిని ఆక్రమించలేదని చెబితే, వెంటనే ఆ స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించి, అక్కడి నిర్మాణాలను, మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు.నీటిపారుదల శాఖ రికార్డుల ప్రకారం ఆ 10 ఎకరాల భూమి పూర్తిగా 'శిఖం' (ప్రభుత్వ) భూమి అని కవిత స్పష్టం చేశారు. కానీ రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం 3 ఎకరాలను మాత్రమే శిఖం భూమిగా చూపి, మిగిలిన 7 ఎకరాలను 'మాగాణి' (ప్రైవేట్) భూమిగా మార్చేశారని.. ఇది స్పష్టమైన నిబంధనల ఉల్లంఘన అని ఆమె ఎండగట్టారు.ఇటీవల పవన్ చేసిన "తెలంగాణ మీ అబ్బ సొత్తా.. మీ జాగీరా?" అనే వ్యాఖ్యలపై కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. "అవును, ఇది కచ్చితంగా మా జాగీరే! 1,200 మంది అమరవీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ ఇది. ఇది తెలంగాణ ప్రజల సొత్తు, ఎవరి ముత్తాతలదో కాదు" అని కవిత ప్రతిస్పందించారు.ఆంధ్రప్రదేశ్‌లో రాజధానిని కూడా నిర్మించలేకపోయిన పవన్.. ఇప్పుడు తెలంగాణలో కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీకి సరైన స్థానిక నాయకులు లేకపోవడం వల్లే పవన్‌ను వాడుకుంటున్నారని విమర్శించారు.ప్రజా గాయకుడు గద్దర్‌కు తాను కారు కొనిచ్చి సాయం చేశానన్న పవన్ వ్యాఖ్యలను కూడా కవిత తప్పుబట్టారు. నైజాం ఏరియా నుంచి తన సినిమాల ద్వారా కోట్లాది రూపాయల రెవెన్యూ సంపాదిస్తున్న పవన్.. ఇక్కడి జానపద కళాకారులను గానీ, చిన్న నిర్మాణాత్మక శక్తులను గానీ ఎప్పుడైనా ఆదుకున్నారా? అని ప్రశ్నించారు. పైగా జానపద కళాకారుల ట్యూన్లను వాడుకుంటూ వారికి కనీస గుర్తింపు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆమె ఒక ఆసక్తికరమైన పోలికను తెరపైకి తెచ్చారు. "అప్పట్లో ఖ.ు.= (కేసీఆర్, టి. హరీశ్ రావు, రామారావు (కల్వకుంట్ల తారకరామారావు) పాలన అనుకుంటే.. ఇప్పుడు కూడా నడుస్తోంది ఖ.ు= (కొండారెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి) పాలనే" అంటూ వ్యంగ్యంగా కామెంట్ చేశారు. గతంలో దోపిడీకి కిటికీలు తెరిస్తే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులే బార్లా తెరిచిందని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఇలాగే అమ్మేసుకుంటూ పోతే రాబోయే తరాలకు ఏమీ మిగలదని, ఈ ల్యాండ్ స్కామ్‌లన్నింటినీ తాము త్వరలోనే బయటపెడతామని కవిత హెచ్చరించారు.

## ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు: హరీశ్ రావు

పాలమూరు ప్రాజెక్టు సందర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డివి "మతిలేని మాటలు" అంటూ ఆయన తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు.నేడు ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన హరీశ్ రావు...బీఆర్ఎస్ చేపట్టబోయే పాదయాత్ర భయంతోనే సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కరువైందని, సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదని స్పష్టం చేశారు. "అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. అందుకే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం 25 శాతానికే పరిమితమైంది" అని హరీశ్ రావు ఆరోపించారు.ఈ వైఫల్యానికి గానూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు పరిధిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. పాలమూరు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని, రాబోయే రోజుల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడించి, పాలమూరు గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జూన్ । ఆదివారం । 7 । 2026



# డిప్యూటీ ఈవో పోస్టులకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్!

మన దునియా,హైదరాబాద్:జూన్ 06

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుభవార్త అందించిం ది, స్కూల్ ఎడ్యుకేషన్ లో కొన్ని ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్న డిప్యూ టీ ఎడ్యుకేషన్ ఆఫీ సర్స్ గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్ 1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది, ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24 గెజిటెడ్ స్థాయి పోస్టులను భర్తీ చేయనున్నట్లు టీజీపీ ఎస్సీ ప్రకటించింది. చాలాకాలంగా ఖాళీగా ఉన్న ఈ ఉన్నత స్థాయి పోస్టులను భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థల పని తీరును మెరుగుపర చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నియామకాలు విద్యా వ్యవస్థలో క్షేత్ర స్థాయి పర్యవేక్షణను పటిష్ఠం చేయడానికి ఎంతగానో దోహదప డతాయని విద్యా రంగ నిపుణులు చెబుతు న్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల అర్హతలకు సంబంధించి కమిషన్ స్పష్టమైన మార్గదర్శకా లను జారీ చేసింది. 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయస్సు తప్పనిసరిగా 18 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయస్సు 44 ఏళ్లుగా నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు వయోపరిమితిలో సడ లింపులు వర్తిస్తాయి. దీనివల్ల సీనియర్ అభ్యర్థులకు సైతం దరఖాస్తు చేసుకునేం దుకు మంచి అవకాశం లభించనుంది.

దరఖాస్తులు సమర్పించవలసిన తేదీలు!

అర్హులైన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు




సమర్పిం చాల్సి ఉంటుంది.

దరఖాస్తుల ప్రారంభ తేదీ: జూన్ 12, 2026

దరఖాస్తులకు చివరి తేదీ: జులై 19, 2026

సూచన: చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు తలెత్త కుండా ఉండేందుకు అభ్యర్థులు ముందే దరఖాస్తు చేసుకోవడం మంచిదని కమిషన్ సూచించింది.

# రెండు రోజుల సీఎం పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమీ లేదు





**బిఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

**మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస రెడ్డిలతో కలిసి మీడియా సమావేశం**

మన దునియా,మహబూబ్‌నగర్: జిల్లా:జూన్ 06

మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస రెడ్డిలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు రోజుల జిల్లా పర్యటనలో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని విమర్శించారు. జిల్లాకు వరాల జల్లు కురిపిస్తారని ప్రజలు ఆశించినప్పటికీ కొత్త హామీలు గానీ, నిధుల కేటాయింపులు గానీ ప్రకటించలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారనే విషయంపై కూడా ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వలేదని అన్నారు. జూరాల పరిధిలో చెక్‌డ్యామ్ నిర్మాణం కోసం ఏరియల్ సర్వే నిర్వహించినప్పటికీ దాని వల్ల తెలంగాణకు ప్రయోజనం ఏమిటో చెప్పలేదని విమర్శించారు. కర్ణాటక ప్రాంతంలోని పనులు, చెక్‌డ్యామ్‌లను పరిశీలించడం ద్వారా రాష్ట్రానికి ఉపయోగం లేదని పేర్కొన్నారు. బాణాకచర్ల అంశంపై కూడా సీఎం ఎలాంటి ప్రస్తావన చేయలేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో కాలువలు, టన్నెల్లు, మోటార్లు, పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్ల నిర్మాణం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిలో కనీస పురోగతి కూడా సాధించలేదని ఆరోపించారు. ప్రాజెక్టులో రూ.33,500 కోట్ల విలువైన పనులు పూర్తి చేశామని, పెండింగ్ బిల్లులు చెల్లించి తమదే కృషి అని చెప్పుకోవడం సరికాదన్నారు. ప్రాజెక్టు జాప్యానికి కాంగ్రెస్ పార్టీ వేసిన కేసులే కారణమని ఆరోపించిన ఆయన, రెండున్నర సంవత్సరాలు గడిచినా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో కాలువల తవ్వకాలు ప్రారంభించలేదన్నారు. సొంత జిల్లాకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని, ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయలు గ్రీన్ ఛానల్ ద్వారా అందిస్తామని సీఎం ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతులకు గిట్టుబాటు, విద్యుత్, యూరియా, వృద్ధులకు పెంచిన పెన్షన్లు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ సామాజిక వర్గం కూడా కాంగ్రెస్ పాలనపై సంతృప్తిగా లేదని, రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన తీర్పు ఇస్తారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు పాలమూరు ప్రాజెక్టులో తమ ప్రభుత్వం చేసిన పనులను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తాము ప్రారంభించి మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించి వాటిని పూర్తి చేయాలని కోరారు..

## సంగెం: ఎరువుల దుకాణాలపై నిఘా: ఏసీపీ

సంగెం మన దునియా జూన్ 06

సంగెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల యజమానులతో మామునూరు ఏసీపీ వెంకటేశ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. లైసెన్స్ లేకుండా విక్రయాలు చేయరాదని, గడువు ముగిసిన ఉత్పత్తులను అమ్మవద్దని స్పష్టం చేశారు. అక్రమ నిల్వలు, అనధికార అమ్మకాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో తహశీల్దార్ రాజ్కుమార్, వ్యవసాయ అధికారి జగదీశ్వర్, ఎస్సై వంశీకృష్ణ పాల్గొన్నారు.



## భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



మన దునియా,వరంగల్:జాన్ 06

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ గారు పేర్కొన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందితో కలిసి పండ్ల మొక్కలను నాటారు. ఈ సంధర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా అటవీ సంపద క్రమంగా తగ్గిపోతుండటం, పచ్చదనం స్థానంలో కాంక్రీట్ నిర్మాణాలు పెరుగుతుండటం, వాహనాలు మరియు పారిశ్రామిక ప్రాంతాల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు. దీనివల్ల వాతావరణ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, సమయానికి వర్షాలు కురవకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిణామాలు ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులకు ప్రధాన కారణం పచ్చదనం తగ్గిపోవడమేనని పేర్కొంటూ , పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విస్తృత స్థాయిలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ద్వారా రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు శ్రీ అంకిత్ కుమార్, శ్రీమతి దారా కవిత, అదనపు డీసీపీలు శ్రీ రవి, శ్రీ సురేష్ కుమార్, శ్రీ శ్రీనివాస్, ఏసీపీలు శ్రీ నర్సింహారావు, శ్రీ నాగయ్య, శ్రీ అంతయ్య, శ్రీ సురేంద్ర, ఆర్ఐలు సతీష్, శ్రీనివాస్, చంద్రశేఖర్, శ్రీధర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మారం గల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గల్ఫ్ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం

ఖానాపూర్ ఆర్సి మన దునియా ,జూన్:06.




మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు తడకపెల్లి చందు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు ధర్మారం గల్ఫ్ అసోసియేషన్ ముందుకొచ్చింది. అసోసియేషన్ సభ్యులు బాధిత కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేసి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ధర్మారం గల్ఫ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు మగ్గిడి తిరుపతి మాట్లాడుతూ, గల్ఫ్ దేశాల్లో పనిచేస్తూ వివిధ ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం మరింత అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. గల్ఫ్ కార్మికుడు మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని గల్ఫ్ అసోసియేషన్ వేదికగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికులు మరియు వారి కుటుంబాలకు ఎటువంటి కష్టం వచ్చినా అండగా నిలుస్తున్న ధర్మారం గల్ఫ్ అసోసియేషన్ సేవలను గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు చిట్యాల రాజు, కట్కూరి రమేష్, చిట్యాల భీమలింగం, చిట్యాల శేఖర్, ఆశాది రాజారావు, కల్లెడ తిరుపతి, సంతపురి సాయి, తడకపెల్లి గంగన్నతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఐటిఐ లలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రిన్సిపల్ జి. దేవానంద్**

మన దునియా, జూన్ 06,మంచిర్యాల



మందమర్రి పట్టణంలో ఐటిఐ 2026 - 27 ఈ విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐ ల లో అడ్మిషన్ల కొరకు నోటిఫికేషన్ విడుదల అయినట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ జి. దేవానంద్ తెలిపారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్ ల లో ప్రవేశాల కోసం తేదీ 25 - 5 - 2026 నుండి ఈనెల జూన్ 8 వ తేదీ వరకు ఆన్ లైన్ లో వంద రూపాయల ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు. పట్టణంలోని ఐటిఐ లో కోర్సులు ఎలక్ట్రిషన్, ఫీట్టర్ డీజిల్ మెకానిక్, డ్రాట్స్ మెయిన్ సివిల్, మ్యాన్ ఫ్యాక్చరింగ్ ప్రాసెస్, ఆటో మిషిన్, ఇండస్ట్రియల్ రోబోటిక్, బేసిక్ డిజైనర్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎస్ ఎస్ సి,ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్, ధ్రువ పత్రాలు ఫోన్ నెంబర్ మెయిల్ ఐడి లలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ జి. దేవానంద్, తెలిపారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## భూక్యా జాన్సన్ నాయక్ జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

**ఖానాపూర్ ఆర్సి మన దునియా జూన్; 06.**



ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి భూక్యా జాన్సన్ నాయక్ జన్మదినం సందర్భంగా శనివారం ఖానాపూర్ పట్టణంలోని వారి క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్‌కు శాలువాతో సన్మానం చేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనకు దీర్ఘాయుష్షు, మంచి ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి కొనసాగాలని నాయకులు పేర్కొన్నారు. భూక్యా జాన్సన్ నాయక్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతోందని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, రాజారాం రెడ్డి , సిటీ మల్ల భరత్, బలసాని శ్రీనివాస్ గౌడ్,కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని జాన్సన్ నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## హోదాను మరిచి, నటనతో ఉన్నత అధికారి కార్మికులతో మమేకం

**మన దునియా, జూన్ 06,మంచిర్యాల**




ఏరియాలో ఐఈడి డిజిఎం గా విధులు నిర్వహిస్తున్న కాందారి కిరణ్ కుమార్ సహజమైన తన నటనతో అటు అధికారులను, ఇటు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నారు. ఏరియా ఉన్నత అధికారిగా సింగరేణికి తనవంతు సేవలు అందిస్తూనే, సింగరేణి కమ్యూనికేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించు పలు సాంస్కృతిక కార్యక్రమాలలో తన హోదాను మరిచి, కార్మికులతో కలిసి, నటనతో ప్రజలకు పలు అంశాలపై చైతన్యం కలిగిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన సింగరేణి, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయనే ప్రదర్శించిన నాటక ప్రదర్శనలు వీక్షణకులను విశేషంగా అలరించగా, తనదైన నటన కౌశల్యంతో వీక్షకులను మంత్రముగ్గలు చేశారు. ముఖ్యంగా ఆయన పోషించిన అంబేద్కర్, రైతు పాత్రలో ఒదిగిపోయి, ఆ పాత్రలకు ప్రాణం పోశారు. గతంలో సైతం ఆయన పలు కార్యక్రమాలలో తన నటన కౌశల్యాన్ని ప్రదర్శించినప్పటికీ ఏరియా ఉన్నత అధికారిగా తన వంతు బాధ్యతలు నిర్వహిస్తూ, కమ్యూనికేషన్స్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో కార్మికులతో కలిసి కళాకారునిగా పాత్రలో లీనమై నటించడం గొప్ప విషయమని పలువురు ఆయన కొనియాడుతున్నారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలందరికీ అత్యంత తొందరగా చేరువయ్యేది కేవలం కళా రంగం అని తెలిపారు. కలల ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేయాలని సదుద్దేశ్యంతో పలు పాత్రలు పోషించడం జరిగిందన్నారు. దీనికి సహకరిస్తున్న తోటి అధికారులకు, ఉద్యోగులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## తెలంగాణలో స్త్రీ రైడ్స్ ప్రాజెక్టును ప్రారంభించిన డీజీపీ

**మన దునియా,హైదరాబాద్:జూన్ 06**

తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ శనివారం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళలకు 2 వీలర్, త్రీ వీలర్ వాహనాల డ్రైవింగ్ నైపుణ్యాలను నేర్పిం చి వారిని స్వయం సమృద్ధులుగా మార్చ డమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం, మొదటి విడుతలో భాగంగా ఎంపిక చేసిన 55 మంది మహిళల కు అంబర్ పేట్ పోలీస్ లైన్స్ లో ఉమెన్ సేఫ్టీ వింగ్ ప్రత్యేకంగా డ్రైవింగ్ శిక్షణ ఇప్పిం చి రవాణా రంగంలో మహిళలపై జరిగే వేధింపులకు అడ్డుకట్ట వేస్తూ, తోటి మహిళ లను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఈ స్త్రీ రైడర్లను సిద్ధం చేస్తున్నారు. ఈ డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ... ప్రజా పాలన– ప్రగతి ప్రణా ళిక కార్య క్రమంలో భాగంగా మహిళ సాధికారత సాధించడ మే లక్ష్యం గా ఈ స్త్రీ రైడ్స్ ప్రాజెక్టును తీసుకొచ్చా మన్నారు.



# జన్నారం అటవీ విభాగం ఆధ్వర్యంలో విజయవంతంగా బర్డ్ వాక్ కార్యక్రమం











**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం, జూన్ 06:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జన్నారం అటవీ విభాగాధికారి మార్గదర్శకత్వంలో శనివారం బర్డ్ వాక్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గేట్ నెం.1 నుండి బైసన్ కుంట వరకు నిర్వహించబడింది. బర్డ్ వాక్ సందర్భంగా సుమారు 60 రకాల పక్షి జాతులను గుర్తించి పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జన్నారం మండల ప్రజాప్రతినిధులు, స్థానిక యువత, జన్నారం మరియు తాళ్లపేట్ అటవీ రేంజ్ అధికారులు, డివిజన్ సిబ్బంది, అలాగే హైదరాబాద్ నుండి వచ్చిన ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు. పాల్గొన్న వారందరూ పక్షుల వైవిధ్యం, వాటి జీవన విధానం, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర, వన్యప్రాణి సంరక్షణ అవసరంపై అవగాహన పొందారు. బర్డ్ వాక్ ద్వారా అటవీ ప్రాంతాల్లోని జీవ వైవిధ్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం లభించిందని, ప్రకృతి సంపదను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. ప్రకృతి పరిరక్షణ, పక్షుల సంరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారు మాట్లాడుతూ, జన్నారం అటవీ ప్రాంతంలో ఉన్న పక్షుల వైవిధ్యం తమను ఎంతగానో ఆకట్టుకుందని, ఇలాంటి కార్యక్రమాలను తరచూ నిర్వహించడం ద్వారా యువతలో ప్రకృతి పట్ల ఆసక్తి, పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అటవీ శాఖ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. బి. కరుణాకర్ జూనియర్ లెక్చరర్ (కెమిస్ట్రీ), ప్రభుత్వ జూనియర్ కళాశాల, జన్నారం అభిప్రాయం:"ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన బర్డ్ వాక్ ఎంతో ప్రయోజనకరమైన కార్యక్రమం. పక్షుల వైవిధ్యం, వన్యప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ మరియు మానవ మనుగడ మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ప్రజలకు తెలియజేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించింది. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువత మరియు ప్రకృతి ప్రేమికులు ప్రత్యక్షంగా ప్రకృతిని పరిశీలించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ పట్ల మరింత అవగాహన పొందారు. 'భూమి కోసం -- జీవవైవిధ్య సంరక్షణ కోసం' అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉంది. భూమాతను స్మరిస్తూ ప్రకృతి సంపదను కాపాడటం మనందరి బాధ్యత. ప్రకృతి పరిరక్షణ కోసం ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు ఆశించకుండా అంకితభావంతో పనిచేస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అందరికీ నా ప్రత్యేక అభినందనలు మరియు ధన్యవాదాలు."

జంపాల శాలినిరీసెర్చ్ స్కాలర్ అభిప్రాయం:

"ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బర్డ్ వాచింగ్ కార్యక్రమంలో పాల్గొనడం నాకు ఒక అద్భుతమైన మరియు విలక్షణమైన అనుభవంగా నిలిచింది. అటవీ అధికారుల ప్రత్యేక పరిజ్ఞానం, పక్షుల ఆవాసాలపై వారికి ఉన్న అవగాహన కారణంగా సాధారణంగా కనిపించని అనేక పక్షి జాతులను కూడా గుర్తించి పరిశీలించే అవకాశం లభించింది. పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణ మరియు ప్రకృతి సమతుల్యతలో పక్షుల పాత్ర గురించి ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం ఒక గొప్ప వేదికగా నిలిచింది. ముఖ్యంగా జన్నారం పరిసర ప్రాంతాలు, కావల్ టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతం పక్షుల పరిశీలనకు అత్యంత అనుకూలమైన సహజ వాతావరణాన్ని కలిగి ఉండటం విశేషం. అటవీ అధికారులతో కలిసి అడవిలో సంచరించడం ద్వారా పక్షులు, వన్యప్రాణుల జీవన విధానం, వాటి నివాస ప్రాంతాలు, ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రత్యక్ష అవగాహన పొందగలిగాను. ఇలాంటి కార్యక్రమాలు ప్రకృతి పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు యువతలో పర్యావరణ పరిరక్షణ బాధ్యతను మరింత బలోపేతం చేస్తాయి. ప్రకృతి సంపదను భావితరాలకు అందించాలంటే ప్రతి ఒక్కరూ జీవవైవిధ్య సంరక్షణలో భాగస్వాములు కావాలి. ఈ విధమైన అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులకు, సిబ్బందికి నా హృదయపూర్వక అభినందనలు."

సత్తయ్య (రిటైర్డ్ ఉద్యోగి) అభిప్రాయం:

"బర్డ్ వాక్ కార్యక్రమంలో పాల్గొనడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఈ కార్యక్రమం ద్వారా అనేక రకాల పక్షులను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించింది. పక్షుల ఆహారపు అలవాట్లు, వాటి జీవన విధానం, ప్రకృతిలో వాటి ప్రాముఖ్యత గురించి ఎఫ్‌డీవో సర్ ఎంతో చక్కగా వివరించారు. నేను రిటైర్డ్ ఉద్యోగినైనా సుమారు 4 కిలోమీటర్లు నడిచినా ఎలాంటి అలసట అనిపించలేదు. ప్రకృతి మధ్యలో గడపడం ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు."

## జన్నారం మండల కేంద్రంలో ఘనంగా భూక్య జాన్సన్ నాయక్ జన్మదిన వేడుకలు

**ఖానాపూర్ ఆర్సి మన దునియా జన్నారం,జూన్;06.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి జన్మదిన సంబరాలను ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పేరం శ్రీనివాస్ పాల్గొని జాన్సన్ నాయక్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా జాన్సన్ నాయక్ గుర్తింపు పొందారని, ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాన్సన్ నాయక్ సేవలను కొనియాడారు. నాయకులు మరియు కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జాన్సన్ నాయక్ అన్నగారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించి ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు.





# జాన్సన్ నాయక్ జన్మదినం సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం




**మన దునియా, జూన్; 06.**

ఈరోజు హైదరాబాద్‌లోని ఏసిల్ ఏఎస్ రావు నగర్‌లో ఉన్న సహారా జ్యోతి ఓల్డ్ ఏజ్ హోమ్లో బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎల్‌హెచ్‌పీఎస్ (లంబాడా హక్కుల పోరాట సమితి) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించగా, వృద్ధాశ్రమంలో నివసిస్తున్న సుమారు 118 మంది వృద్ధులకు భోజన వసతి కల్పించి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, సమాజంలో వృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ పెంపొందించాల్సిన అవసరం ఉందని, జాన్సన్ నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహారా జ్యోతి ఓల్డ్ ఏజ్ హోమ్ వ్యవస్థాపకురాలు జ్యోతి, ఆల్ ఇండియా కార్పొరేట్ రికవరీ చీఫ్ ఆఫీసర్ మాలోత్ శంకర్ నాయక్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వృద్ధాశ్రమంలోని పెద్దలు ఈ సేవా కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జాన్సన్ నాయక్ జన్మదినం సందర్భంగా చేపట్టిన ఈ అన్నదాన కార్యక్రమం సేవా స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహణ




**మన దునియా ప్రతినిధి, కమలాపూర్:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల,భీంపల్లి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గ్రామ సర్పంచ్ వాసాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ మునిగే రాజు, గ్రామ కార్యదర్శి లావణ్య, పాలకవర్గం ఆధ్వర్యంలో, నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మండల అధికారులు ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, ఇరిగేషన్ ఏఈ సాయికిరణ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రకృతి మనకు అందించిన గాలి, నీరు, మట్టి వంటి అమూల్యమైన వనరులను కాపాడుతూ రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. "ఋణం తీర్చుకునే రోజు" అనే సందేశంతో వారు మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి తన జీవితంలో కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని,. చెట్ల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు స్వచ్ఛమైన గాలి, సమృద్ధిగా నీటి వనరులు, సారవంతమైన మట్టిని కాపాడుకోవచ్చన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటిని పొదుపుగా వినియోగించడం, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి చర్యలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించడం ద్వారా గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అధికారులు సూచించిన పర్యావరణ పరిరక్షణ చర్యలను పాటిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని గ్రామస్థులు తెలిపారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, సి ఎమ్ ఆర్ ఐ,చెక్కుల పంపిణీ





**మన దునియా హుజురాబాద్ నియోజకవర్గం**

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఎమ్ ఆర్ ఐ )చెక్కులను లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి స్వయంగా పంపిణీ చేశారు. హుజురాబాద్ నియోజకవర్గం లోని,దమ్మక్కపేట, గాంధీనగర్, ప్రతాపవాడ ప్రాంతాల్లో లబ్ధిదారులను కలిసి చెక్కులు అందజేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్

**మన దునియా,నల్గొండ జిల్లా: జూన్ 06**



నల్గొండ జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ మహమ్మద్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, పెద్దవూరలోని జామే మస్జిద్ అబూబకర్ సిద్ధిఖ్ రహ్మతుల్లా అలై ఆస్తిని వక్ఫ్ బోర్డు రికార్డుల్లో నమోదు చేయాలంటూ ఫిర్యాదుదారు 2025 ఫిబ్రవరి 25న వక్ఫ్ బోర్డు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఆ వినతిపై హైదరాబాద్‌లోని వక్ఫ్ బోర్డు సీఈఓకు వాస్తవ నివేదిక పంపించేందుకు అనుకూలంగా వ్యవహరించాలనే ఉద్దేశంతో ఇన్‌స్పెక్టర్ షేక్ మహమ్మద్ ఫిర్యాదుదారుని నుంచి రూ.10 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది.

## పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్,2026లో మల్కాజ్గిరి ఎంపీ,ఈటల రాజేందర్



**మన దునియా**



పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ 2026 కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశం ముందు, పార్టీ తర్వాత, వ్యక్తి ఆ తరువాత అనే గొప్ప సిద్ధాంతంతో పనిచేసే పార్టీ అని అన్నారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు, భారతీయ సంస్కృతి, జాతీయవాద భావజాలమే బీజేపీకి బలమైన పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు. కేవలం ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బీజేపీ నేడు ప్రజల విశ్వాసంతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ,నాయకత్వంలో ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామమందిర నిర్మాణం వంటి చారిత్రాత్మక నిర్ణయాలు అమలయ్యాయని తెలిపారు. అవినీతి రహిత, పారదర్శక పాలనతో కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల ఆదరణ పొందుతోందని పేర్కొన్న ఆయన, తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు మరింత కష్టపడి పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ శిక్షణ శిబిరంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణలో ముందస్తుగానే పాఠ్యపుస్తకాలు పంపిణీ!

**మన దునియా,హైదరాబాద్:జూన్ 06**



ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు బడులు తెరిచిన రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించా లని, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది ఈ క్రమంలో ఇప్పటికే 95% పుస్తకాలు జిల్లా కేంద్రాలకు చేరుకోగా ఇందులో అరవై శాతానికి పైగా బుక్స్ స్కూళ్లకు చేరాయి మిగిలిన పుస్తకాలు నాలుగైదు రోజుల్లోగా జిల్లాలకు చేరేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో 29 వేల సర్కార్ బడులతో పాటు,కేజీబీవీలు మోడల్ స్కూల్స్, యూఆర్ఎస్, గురుకులాలు, ఎయిడెడ్, స్కూళ్లు ఉండగా.. వాటిలో 24.44 లక్షల మంది విద్యార్థులు చదువు తున్నారు. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఉచి తంగా పాఠ్యపుస్తకా లను ప్రతి ఏటా పంపి ణి చేస్తుంది, 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి, విద్యా ర్థుల కోసం 1,40,92, 385 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా పార్ట్ 1 సిలబస్ పుస్తకాల ప్రింటింగ్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది, శుక్రవారం నాటికి 95% పుస్తకాలు వివిధ జిల్లా కేంద్రాలకు చేరాయి. సర్కార్ బడుల్లో చదివే పిల్లలకు ప్రభుత్వ నోట్ బుక్స్ కూడా అంది స్తుంది, తొలిసారిగా ప్రైమరీ స్కూల్ స్టూడెంట్ లకు ఈ ఏడాది నుంచి ప్రారంభించింది, వీరి కోసం1.11 కోట్ల నోట్ బుక్స్ అవసరం కాక ఇప్పటికే 1.01 కోట్ల నోట్స్ బుక్ లను అధికారులు జిల్లాలకు చేర్చారు. జనగామ, భూపాల పల్లి, హైదరాబాద్, గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, అసిఫాబా ద్, మహబూబాబాద్, ములుగు, నిజామా బాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, జిల్లాలకు మినహా మిగిలిన అన్ని జిల్లాలకు 100%నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ జిల్లాలో కూడా స్కూల్స్ రీ ఓపెనింగ్ రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అం దించేలా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రికార్డు అస్టెంట్ శివ.




**మన దునియా,జోగులాంబ గద్వాల జిల్లా,అలంపూర్:జూన్ 06**

జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజకవర్గం, రాజోలి మండల రెవెన్యూ కార్యాలయంలో రికార్డుల అన్వేషణకు తరుచుగా నకలు, పహనీలు,ఆర్ ఓ ఆర్,సాదాబైనామా,రిజిస్టర్ డాక్యుమెంట్,పంచనామ పత్రాలు,మ్యుటేషన్ పత్రాలు, ప్రొసీడింగ్స్ ఓ ఆర్ సి మొదలైన..తదితర పూర్తి వివరముల సర్టిఫైడ్ పత్రముల రికార్డు అన్వేషణ కొరకు దరఖాస్తు చేసుకొన్న వారిని,వారికి రికార్డు సమయానికి ఇవ్వకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకొని,ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. నెలల గడుస్తున్నా రికార్డు ఇవ్వకుండా,అదిగో ఇదిగో అని మా సమయాన్ని వృధా చేస్తున్నాడు అని రికార్డు అస్టెంట్ శివ పై మండలం లోని వివిధ గ్రామాల భాదితులు ఆరోపణలు చేస్తున్నారు. రికార్డు అన్వేషణ ఎంతో అవసరమని,అటువంటి రికార్డును సక్రమంగా ఇవ్వకుండా తప్పుదోవ పట్టిస్తున్నాడు. పచ్చర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కి సమాచారం హక్కు చట్టం కింద సమాచారం అడిగినా రికార్డు అస్టెంట్ ఉద్దేశ పూర్వకంగానే అడిగిన రికార్డు ఇవ్వలేదు,చిన్న దన్వాడ్ గ్రామానికి చెందిన వ్యక్తి కి ఆరు నెలలు అవుతున్న రికార్డు ఇవ్వడంలేదని ఆ వ్యక్తి తీర్వ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పెద్ద తాండ్రపాడ్ కు చెందిన 70 సంవత్సరాల వయసు గల వ్యక్తిని కూడా ఇబ్బంది పెడుతున్నాడని సమాచారం ప్రభుత్వ ఉద్యగం చేస్తూ,ప్రభుత్వంతో జీతం తీసుకుంటూ ప్రజలను ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయా గ్రామాల్లో ప్రజలు వాపోతున్నారు. ఏదైనా ఆశిస్తున్నాడా అనే అనుమానాలను వారు వ్యక్తం చేస్తున్నారు. రికార్డు అస్టెంట్ పై సోమవారం నాడు ప్రజావాణి లో పూర్తి ఆధారాలతో జిల్లా కలెక్టర్ గారికి పిర్యాదు చేయనున్నారు.

## గద్వాల సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఉద్యోగి నిర్లక్ష్యం

**మన దునియా,జోగులాంబ గద్వాల:జూన్ 06**



జోగులాంబ గద్వాల: ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు ఎలా ఉన్నాయో చెప్పడానికి ఈ ఫోటో ఒక నిదర్శనం.గద్వాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధుల సమయంలోనే ఒక ఉద్యోగి కుర్చీలో కూర్చొని నిద్రపోతున్న దృశ్యం కనిపించింది. టేబుల్ మీద రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, స్టాంప్ పేపర్లు ఉండగా, ప్రజలు పనుల కోసం వేచి చూస్తున్న సమయంలో ఉద్యోగి నిద్రలోకి జారుకున్నాడు.ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం గంటల తరబడి ఎదురుచూసే ప్రజలకు ఇది తీవ్ర ఇబ్బందికరంగా మారింది.”జీతం ప్రజల సొమ్ము,డ్యూటీలో నిద్రా?” అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.జిల్లా రిజిస్ట్రార్,స్టాంప్స్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## తల్లి తండ్రులను కోల్పోయిన ఆడ పిల్లలు శృతి, సౌమ్య లకు అరవై వేల ( 60,000) ఆర్థిక సాయం చేసిన మెపా తెలంగాణ

**దాతలకు ధన్యవాదాలు**

**బిమెపా వ్యవస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ్**

**మన దునియా,వరంగల్ జిల్లా దుగ్గొండి,వెంకటాపురం:జూన్ 06**

ఇటీవల కాలంలో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురం బీసీ కాలనీ చెందిన జీర్ర రాజు ముదిరాజ్ ఇటీవల మృతిచెందారు.15 సంవత్సరాల క్రితం రాజు భార్య కవిత క్యాన్సర్ తో మృతి చెందారు.వీరికి ఇద్దరు ఆడపిల్లలు :శృతి బి.టెక్ మొదటి సం,సౌమ్య పదవతరగతి పూర్తి చేసిన అమ్మాయిలు ఉన్నారు. తల్లిదండ్రులను కోల్పోవడంతో వీరి మేనమామలు ముద్రపోయిన సదానందం,మోహన్ ల సహకారంతో ఇప్పటివరకు కాలం గడిపారు.కష్ట కాలంలో ఉన్నాము,తల్లిదండ్రులను కోల్పోయాము సాయం చేయండి అని, చేతులెత్తి వేడుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా ఆ విషయం మెపా ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మెపా డోనర్స్ 102 దాతల సహకారంతో 60 వేలు జమ చేసి ,ఈ సహాయాన్ని శనివారం వెంకటాపురం బీసీ కాలనీకి వెళ్లి రాజు కూతుళ్లు శృతి సౌమ్య లకు ముద్రబోయిన సదానందం సహకారంతో అందజేసారు. అనంతరం మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఎవరికి ఆపద వచ్చిన ఆ గ్రామ ముదిరాజ్ లే యూనిటీ గా ఏర్పడి ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలని,ముదిరాజ్ లు సాయం తీసుకునే స్థాయి నుండి సాయం చేసే స్థాయికి చేరుకోవాలని శృతి,సౌమ్య లకు సాయం చేసిన దాతలకు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శృతి సౌమ్య లతో పాటు ముద్రబోయిన సదానందం మాట్లాడుతూ..మా కుటుంబానికి సాయం చేసిన దాతలకు రుణపడి ఉంటాము అని,భవిష్యత్ లో మేము సాయం చేసే స్థాయికి చేరుకుంటాము అని అన్నారు.ఈ కార్యక్రమంలో ముద్రబోయిన సదానందం, రేగుల ప్రవీణ్,సరోజన,సాంబ లక్ష్మీ,ముద్రబోయిన ఏకాంబరం,రమేష్,పిఆర్టియు తెలంగాణ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను రాజమౌళి,తాళ్ళ శేఖర్,రాజ్ కుమార్, సాయి కుమార్,బోళ్ళ మల్లేశం ముదిరాజ్ లు పాల్గొన్నారు.



## చెరువు శిక్కం భూములపై అక్రమ కబ్జాలు అరికట్టాలి -- తహసీల్దార్‌కు తుడుం దెబ్బ వినతి

**ఆకులవారిగణపురం చెరువు శిక్కం భూములపై అక్రమ కబ్జాలు వెంటనే తొలగించాలి -- తుడుం దెబ్బ డిమాండ్**

**ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తున్న కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**ఆదివాసీల హక్కులను కాలరాస్తే భారీ ప్రజా ఉద్యమం తప్పదు -- తాటి నీలాద్రి హెచ్చరిక**

**ములుగు జిల్లా జూన్ 06 మన దునియా**

ఏటూరునాగారం మండలంలోని ఆకులవారిగణపురం గ్రామంలో ఐటిడిఏ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ చెరువు శిక్కం భూములు బహిరంగంగా అక్రమ కబ్జాలకు గురవుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ ఐటిడిఏ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) మండల అధ్యక్షులు తాటి నీలాద్రి అన్నారు ఈ మేరకు ఏటూరునాగారం తహసీల్దార్ కి వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ 1/70 భూ బదిలీ నియంత్రణ చట్టం ఆదివాసీ భూములను రక్షించడానికి ప్రత్యేకంగా అమల్లో ఉన్నప్పటికీ కొంతమంది గిరిజనేతరులు రాజకీయ అండదండలతో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తూ చట్టాలను బహిరంగంగా ధిక్కరిస్తున్నారని ఆరోపించారు ప్రజల సామూహిక అవసరాలకు భవిష్యత్ తరాల ప్రయోజనాలకు సంబంధించిన చెరువు శిక్కం భూములపై అక్రమ నిర్మాణాలు చేపట్టడం కేవలం చట్టవిరుద్ధమే కాకుండా ప్రజా సంపదను దోచుకోవడమేనని మండిపడ్డారు కొందరు గిరిజనేతరులు గిరిజన మహిళలను వివాహం చేసుకోని వారి పేర్లను అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూములను కాజేయడానికి ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు ఏజెన్సీ ప్రాంతంలో భూముల ఆక్రమణలు పెరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న కారణాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు గిరిజనుల భూములను రక్షించాల్సిన యంత్రాంగమే మౌనం పాటిస్తే ఆదివాసీలకు న్యాయం ఎక్కడ దొరుకుతుందని ప్రశ్నించారు అక్రమ కబ్జాల కారణంగా గ్రామంలోని నీటి వనరులు ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన భూములు భవిష్యత్తులో పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు



ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు శిక్కం భూముల పూర్తి సర్వే నిర్వహించి భూ రికార్డులను ప్రజల ముందు ఉంచి పారదర్శకంగా చర్యలు చేపట్టాలని కోరారు అలాగే అక్రమంగా ఆక్రమించిన భూములను వెంటనే స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేశారు జిల్లా కలెక్టర్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తహసీల్దార్ తక్షణమే జోక్యం చేసుకొని ఆదివాసీల హక్కులను పరిరక్షించాలని కోరుతూ లేకపోతే తుడుం దెబ్బ ఆధ్వర్యంలో గ్రామస్థులతో కలిసి భారీ స్థాయిలో ధర్నాలు రాస్తారోకోలు ముట్టడులు ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు ఏజెన్సీ భూములు ఆదివాసీల జీవనాధారం ప్రభుత్వ భూములపై అక్రమ కబ్జాలు సహించం వెంటనే ఖాళీ చేయాలి లేకపోతే ప్రజా ఉద్యమంతో సమాధానం చెబుతాం అని తాటి నీలాద్రి స్పష్టం చేశారు

## భూక్య జాన్సన్ నాయక్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

**మన దునియా ,జూన్;06.**

బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీ భూక్య జాన్సన్ నాయక్ అన్న జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న రాగుల వెంకటేష్, కృష్ణ రాథోడ్, లక్ష్మణ్, రవి.తలసేమియా బాధితులకు నిరంతరం రక్తం అవసరమవుతుండటంతో, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భూక్య జాన్సన్ నాయక్ అన్న ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు




నూరేళ్లు జీవించాలని భగవంతుడిని మనసారా ప్రార్థించారు. సమాజ సేవలో ఆయన మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# ఫిఫా వరల్డ్ కప్‌లో టెక్నాలజీ విప్లవం.. సెన్సార్ బంతి, ఏఐ అవతార్లతో సరికొత్త ఫుట్‌బాల్

**2026 ఫిఫా వరల్డ్ కప్‌లో సరికొత్త టెక్నాలజీ వినియోగం**

**సెన్సార్‌తో కూడిన 'ట్రయోండా' బంతితో కచ్చితమైన నిర్ణయాలు**

**ఏఐ ఆధారిత 3డీ అవతార్లతో ఆఫ్‌సైడ్ గుర్తింపు**

**ప్రతి మ్యాచ్‌లో రిఫరీలకు బాడీ కెమెరాలు, తప్పనిసరి హైడ్రేషన్ బ్రేక్స్**

**48 జట్లతో అతిపెద్ద టోర్నమెంట్‌గా రికార్డ్**



అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న 2026 ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలోనే అతిపెద్దదిగా నిలవడమే కాకుండా, టెక్నాలజీ పరంగానూ ఓ విప్లవాన్ని తీసుకురాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అత్యాధునిక సెన్సార్ల సహాయంతో ఆటలో పారదర్శకత పెంచేందుకు, అభిమానులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు ఫిఫా సిద్ధమైంది. ఈ టోర్నమెంట్ కోసం అడిడాస్ ప్రత్యేకంగా 'ట్రియోండా' అనే బంతిని రూపొందించింది. ఈ బంతి లోపల ఒక ఇనర్షియల్ మెజర్‌మెంట్ యూనిట్ (ఐఎంయూ) సెన్సార్ చిప్‌ను అమర్చారు. ఇది సెకనుకు 500 సార్లు బంతి కదలికలను, దాని వేగాన్ని, 3డీ స్పేస్‌లో అది ప్రయాణిస్తున్న తీరును రికార్డ్ చేస్తుంది. ఈ డేటాను నేరుగా వీడియో అసిస్టెంట్ రిఫరీ (వీఏఆర్) సిస్టమ్‌కు పంపుతుంది. తద్వారా ఆఫ్‌సైడ్, బంతి ఎవరికి తగిలింది వంటి వివాదాస్పద నిర్ణయాలను మరింత కచ్చితత్వంతో తీసుకోవచ్చు. లెనోవో భాగస్వామ్యంతో మరో ముందడుగు వేశారు. ప్రతి ఆటగాడిని కేవలం ఒక్క సెకనులో స్కాన్ చేసి, వారి శరీర కొలతలతో కూడిన కచ్చితమైన 3డి మోడళ్లను (అవతార్లను) సృష్టిస్తారు. ఈ ఏఐ ఆధారిత అవతార్లు సెమీ-ఆటోమేటెడ్ ఆఫ్‌సైడ్ టెక్నాలజీకి ఎంతగానో ఉపయోగపడతాయి. ఆటగాళ్లు గుంపులో ఉన్నా లేదా వేగంగా కదులుతున్నా, వారి కదలికలను కచ్చితంగా ట్రాక్ చేయడానికి ఇవి సహాయపడతాయి. ఈ అవతార్ల ద్వారా ఆఫ్‌సైడ్ నిర్ణయాలను అభిమానులకు మరింత స్పష్టంగా చూపించనున్నారు. వీటితో పాటు మరిన్ని మార్పులు కూడా ఉన్నాయి. ఆఫ్‌సైడ్ టెక్నాలజీని 10 సెం.మీ. కచ్చితత్వం వరకు మెరుగుపరిచారు. రిఫరీలకు రియల్ టైం ఆడియో హెచ్చరికలు అందుతాయి. మొత్తం 104 మ్యాచ్‌లలో రిఫరీలు బాడీ కెమెరాలను ధరిస్తారు, ఇది అభిమానులకు మైదానంలో ఉన్న అనుభూతిని ఇస్తుంది. మెక్సికోలో భద్రత కోసం రోబో డాగ్స్‌ను కూడా వినియోగించనున్నారు. ఆటగాళ్ల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతి అర్ధ భాగంలో 22వ నిమిషం వద్ద 3 నిమిషాల హైడ్రేషన్ బ్రేక్ తప్పనిసరి చేశారు. మొత్తం 48 జట్లతో జరగనున్న ఈ అతిపెద్ద టోర్నమెంట్‌లో టెక్నాలజీ వినియోగం ఆటను మరింత నిష్పక్షపాతంగా మార్చడమే కాక, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఫుట్‌బాల్ అభిమానులకు ఒక సరికొత్త వీక్షణ అనుభవాన్ని అందించడం ఖాయం.

# సీనియర్లను పక్కనబెట్టి అయినా అతడ్ని ఆడించాలి: గవాస్కర్



**ఐర్లాండ్ సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీని ఆడించాలని చెప్పిన గవాస్కర్**

**ఐపీఎల్ 2026లో ఆరెంజ్ క్యాప్ గెలిచిన 15 ఏళ్ల సంచలనం**

**అవసరమైతే సంజూ, అభిషేక్ శర్మలను పక్కన పెట్టాలని సూచన**

**భారత సీనియర్ జట్టుకు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డ్**

**ఐర్లాండ్ సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా నియామకం**

ఐర్లాండ్‌తో జరగబోయే టీ20 సిరీస్‌లో 15 ఏళ్ల బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీని తప్పకుండా తుది జట్టులోకి తీసుకోవాలని భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ సూచించాడు. అవసరమైతే రెగ్యులర్ ఓపెనర్లను పక్కనపెట్టి అయినా అతనికి అవకాశం ఇవ్వాలని స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 776 పరుగులతో ఆరెంజ్ క్యాప్ గెలవడమే కాకుండా, రికార్డు స్థాయిలో 72 సిక్సర్లు కొట్టి వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ ప్రదర్శనతో ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌లతో పాటు ఆసియా క్రీడలకూ ఎంపికయ్యాడు. 15 ఏళ్ల 71 రోజుల వయసులో భారత సీనియర్ జట్టుకు ఎంపికైన అత్యంత పిన్నవయస్కుడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు. "అధికారం నా చేతిలో ఉంటే, ఐర్లాండ్ సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీని కచ్చితంగా ఆడిస్తాను. ఆ టీ20 మ్యాచ్‌లలో అతను ఆడటం నేను చూడాలనుకుంటున్నాను. తుది జట్టులో అతను ఉండాలి. అవసరమైతే, సంజూ శాంసన్‌ను ఒక మ్యాచ్‌లో, అభిషేక్ శర్మను మరో మ్యాచ్‌లో పక్కనపెట్టి అయినా సరే" అని గవాస్కర్ అన్నాడు. "అతని ఫామ్, అతను చేసిన పరుగులు చూడండి. ఇంత అద్భుత ప్రదర్శన తర్వాత అతన్ని ఎలా ఎంపిక చేయకుండా ఉంటారు? డ్రెస్సింగ్ రూమ్‌లో అతను ఎన్నో విషయాలు నేర్చుకుంటాడు, అది అతని కెరీర్‌కు ఎంతో మేలు చేస్తుంది" అని గవాస్కర్ వివరించాడు. శనివారం నాడు బీసీసీఐ ప్రకటించిన భారత టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా నియమించారు. సూర్యకుమార్ యాదవ్‌కు చోటు దక్కలేదు. జస్‌ప్రీత్ బుమ్రాకు ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌ల నుంచి విశ్రాంతి ఇచ్చి, ఆసియా క్రీడలకు ఎంపిక చేశారు. కాగా, ఈ పర్యటనలో వైభవ్‌కు తోడుగా ఉండేందుకు అతని తల్లిదండ్రులను కూడా అనుమతించాలని బీసీసీఐ నిర్ణయించింది.

# ఆఫ్ఘన్‌తో టెస్ట్: సెంచరీలతో కదం తొక్కిన గిల్, రాహుల్.. తొలి రోజు భారత్ ఆధిపత్యం

**భారత్-ఆఫ్ఘనిస్థాన్ ఏకైక టెస్టు**

**టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా**

**మొదటి రోజు ఆట చివరికి టీమిండియా తొలి ఇన్నింగ్స్ స్కోరు 368/3**

**కేఎల్ రాహుల్ 100 అవుట్... సెంచరీ చేసి క్రీజులో ఉన్న గిల్**

**అర్ధసెంచరీతో ఆకట్టుకున్న పంత్**

**వికెట్ల కోసం చెమటోడ్చిన ఆఫ్ఘన్ బౌలర్లు**

ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా తొలి రోజు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (103 నాటౌట్), సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (100) అద్భుతమైన సెంచరీలతో కదం తొక్కగా, యువ ఆటగాడు సాయి సుదర్శన్ (81), రిషభ్ పంత్ (50 నాటౌట్) అర్ధశతకాలతో రాణించారు. దీంతో, శనివారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్ లో కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 368 పరుగుల భారీ స్కోరుతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. మొహాలీలోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. సుదీర్ఘమైన టీ20 సీజన్ తర్వాత టెస్ట్ క్రికెట్‌కు భారత బ్యాటర్లు ఎలా అలవాటు పడతారన్న ప్రశ్నకు వారు తమ బ్యాట్లతోనే సమాధానమిచ్చారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (24) తక్కువ స్కోరుకే వెనుదిరిగినా, తర్వాత వచ్చిన బ్యాటర్లు ఆఫ్ఘన్ బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. రెండో వికెట్‌కు క్రీజులో నిలిచిన కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ ఆఫ్ఘన్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. ఈ క్రమంలో సుదర్శన్ 81 పరుగుల వద్ద ఔటవగా, వీరిద్దరి మధ్య రెండో వికెట్‌కు 139 పరుగుల కీలక భాగస్వామ్యం నమోదైంది. ఆ తర్వాత కెప్టెన్ గిల్‌తో జతకట్టిన రాహుల్, తన క్లాస్ ఆటతీరుతో ఆకట్టుకుంటూ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే, శతకం సాధించిన మరుసటి బంతికే 100 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రాహుల్ పెవిలియన్ చేరాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన వికెట్ కీపర్ రిషభ్ పంత్‌తో కలిసి కెప్టెన్ గిల్ ఇన్నింగ్స్ కొనసాగించాడు. పంత్ తనదైన శైలిలో దూకుడుగా ఆడగా, గిల్ ఎంతో బాధ్యతాయుతమైన కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంటూ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరూ అజేయంగా నాలుగో వికెట్‌కు 121 పరుగులు జోడించి తొలి రోజు ఆటను ముగించారు. గిల్ (103 బ్యాటింగ్), పంత్ (50 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్ బౌలర్లు రోజంతా తీవ్రంగా శ్రమించారు. ముఖ్యంగా పేసర్లు తొలి రెండు సెషన్లలో భారత బ్యాటర్లను కొంతవరకు కట్టడి చేసే ప్రయత్నం చేసినా, చివరి సెషన్‌లో పూర్తిగా తేలిపోయారు. సలీం సఫీ రెండు వికెట్లు తీయగా, జియావుర్ రహ్మాన్ షరీఫీకి ఒక వికెట్ దక్కింది. రెండో రోజు ఉదయం బౌలర్లు తాజాగా ఉన్నప్పుడు పరిస్థితులు అనుకూలించవచ్చనే ఆశతో వారు రెండో కొత్త బంతిని కూడా తీసుకోలేదు. మొత్తంగా తొలి రోజు ఆట పూర్తిగా టీమిండియాకే సొంతమైంది.



# ఆఫ్ఘన్‌తో టెస్టులో కేఎల్ రాహుల్ సెంచరీ.. ఆ తర్వాతి బంతికే అవుట్!

**న్యూ ఛండీగఢ్ లో టీమిండియా-ఆఫ్ఘనిస్థాన్ టెస్టు**

**టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా**

**సెంచరీతో మెరిసిన కేఎల్ రాహుల్... టెస్టు కెరీర్ లో 122వ శతకం**

ఏకైక టెస్టులో పటిష్ఠ స్థితిలో టీమిండియాఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో టీమిండియా బ్యాటర్ కేఎల్ రాహుల్ అద్భుత శతకంతో మెరిశాడు. అయితే, సెంచరీ పూర్తి చేసుకున్న ఆనందం అతనికి ఎంతోసేపు నిలవలేదు. శతకం బాదిన మరుసటి బంతికే పెవిలియన్ చేరి తీవ్ర నిరాశతో వెనుదిరిగాడు. టెస్టుల్లో ఇలా సెంచరీ పూర్తికాగానే ఔటవ్వడం రాహుల్‌కు ఇది వరుసగా మూడోసారి కావడం గమనార్హం. చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి రోజు ఆటలో భారత బ్యాటర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. ఓపెనర్ రాహుల్ (100) సెంచరీకి తోడు, యువ ఆటగాడు సాయి సుదర్శన్ (81), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (65 బ్యాటింగ్) అర్ధశతకాలతో రాణించారు. దీంతో భారత్ భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. ఇన్నింగ్స్ ఆరంభంలో యశస్వి జైస్వాల్ (24) త్వరగా ఔటైనప్పటికీ, రెండో వికెట్‌కు రాహుల్, సాయి సుదర్శన్ 139 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. సుదర్శన్ ఔటయ్యాక, గిల్‌తో కలిసి రాహుల్ మూడో వికెట్‌కు 67 పరుగులు జోడించాడు. ఈ క్రమంలోనే రాహుల్ తన 12వ టెస్టు సెంచరీని పూర్తి చేసుకున్నాడు. జియావుర్ రెహ్మాన్ బౌలింగ్‌లో శతకం సాధించిన రాహుల్, ఆ తర్వాతి బంతికే కవర్ డ్రైవ్ ఆడి గుర్బాజ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ప్రస్తుతం భారత్ తొలి ఇన్నింగ్స్ లో 3 వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. క్రీజులో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ (6) ఉన్నారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## సమాజంలోని ఘటనలకు సినిమాలకు లంకె.. నటి అనసూయ కీలక వ్యాఖ్యలు



**సమాజంలో జరిగే ఘటనలకు సినిమాలను నిందించడం సరికాదన్న అనసూయ**

**కథ రాసేవారి నుంచి చూసే ప్రేక్షకుల వరకు అందరికీ బాధ్యత ఉంటుందని వ్యాఖ్య**

**క్రియేటివ్ విభేదాల వల్ల కొన్ని అవకాశాలు వదులుకున్నానని వెల్లడి**

**సోషల్ మీడియాలో సినీ కంటెంట్‌ను విశ్లేషించడం మంచి పరిణామమని వ్యాఖ్య**

సమాజంలో చోటుచేసుకునే ప్రతి సంఘటనకు సినిమాలను కారణంగా చూపడం సరికాదని ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ అభిప్రాయపడ్డారు. సినిమా ప్రభావం, సామాజిక బాధ్యత అంశాలపై శనివారం ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సృజనాత్మక స్వేచ్ఛతో పాటు, కంటెంట్ విషయంలో ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉండాలని ఆమె గుర్తుచేశారు.సినిమా అనేది ప్రాథమికంగా ఒక కథా రూపమని, అందులోని మంచి చెడులను ప్రేక్షకులు తమ విచక్షణతోనే గ్రహించాలని ఆమె పేర్కొన్నారు. సమాజంలో జరిగే ప్రతికూల పరిణామాలకు సినిమాలనే తప్పుబట్టడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. కంటెంట్ విషయంలో క్రియేటర్లు, దర్శకులు, నటులతో పాటు ప్రేక్షకులకు సైతం సమాన బాధ్యత ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.గతంలో సినిమాల్లో కథానాయకులు స్ఫూర్తిప్రదాతలుగా, ప్రతినాయకులు గుణపాఠంగా ఉండేవారని, కానీ ప్రస్తుతం నాటకీయత కోసం ఆ వ్యత్యాసాన్ని స్పష్టంగా చూపడం లేదని అనసూయ అభిప్రాయపడ్డారు. క్రియేటివ్ అంశాల్లో ఏకీభవించలేక కొన్నిసార్లు తాను అవకాశాలను సైతం వదులుకున్నట్లు ఆమె వెల్లడించారు. సోషల్ మీడియాలో సినిమా కంటెంట్‌ను విశ్లేషించడాన్ని, ప్రశ్నించడాన్ని ఆమె స్వాగతించారు. దీనిని సృజనాత్మకతపై దాడిగా కాకుండా, సమాజంలో పెరుగుతున్న చైతన్యంగా భావించాలని అన్నారు. తన వ్యాఖ్యలు ఎవరినీ వ్యక్తిగతంగా ఉద్దేశించినవి కావని, పరిశ్రమలోని ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యతను గుర్తు చేయడమే తన అభిమతమని అనసూయ వివరణ ఇచ్చారు.

## బాక్సాఫీస్ ఛాంపియన్ 'పెద్ది'.. రెండు రోజుల్లో ఎంత వసూల్ చేసిందంటే..!

**రామ్ చరణ్ 'పెద్ది' చిత్రానికి భారీ వసూళ్లు**

**రెండు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 181.8 కోట్ల గ్రాస్**

**తొలి రోజు రూ. 135.36 కోట్లు రాబట్టిన సినిమా**

**వసూళ్ల వివరాలను అధికారికంగా ప్రకటించిన నిర్మాణ సంస్థ**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వచ్చిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. ఈ సినిమా విడుదలైన తొలి రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 181.8 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.తొలి రోజు రూ. 135.36 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం, రెండో రోజు కూడా అదే జోరును కొనసాగించింది. "బాక్సాఫీస్ ఛాంపియన్ పెద్ది థియేటర్లను జయిస్తోంది" అంటూ నిర్మాణ సంస్థ తన పోస్టర్‌లో పేర్కొంది. దేశీయంగానే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'పెద్ది' భారీ వసూళ్లు రాబడుతోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ చిత్రం ఇప్పటికే 2.2 మిలియన్ డాలర్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసి సత్తా చాటింది.ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించారు. విశ్వసంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం సినిమాకు అదనపు ఆకర్షణగా నిలిచింది.






## 80 కేజీల డెడ్‌లిఫ్ట్ ఎత్తడంతో గాయమైంది... ఆ సమయంలో మంచానికే పరిమితమయ్యాను: రకుల్ ప్రీత్ సింగ్

**సేఫ్టీ బెల్ట్ లేకపోవడం వల్ల స్లిప్ డిస్క్ సమస్య వచ్చిందని వెల్లడి**

**గాయం కారణంగా 40 రోజుల పాటు మంచానికే పరిమితమయ్యానని వివరణ**

**డెడ్‌లిఫ్ట్‌ను ఒక ఈగో లిఫ్ట్ అని అభివర్ణించిన నటి**

**కష్టకాలంలో భర్త జాకీ భగ్నానీ అండగా నిలిచాడని వ్యాఖ్య**

ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ తాను గతంలో ఎదుర్కొన్న తీవ్రమైన ఆరోగ్య సమస్య గురించి తాజాగా స్పందించారు. జిమ్‌లో శిక్షణ పొందుతున్న సమయంలో 80 కిలోల డెడ్‌లిఫ్ట్‌ను ఎటువంటి సేఫ్టీ బెల్ట్ లేకుండా ప్రయత్నించడం వల్ల స్లిప్ డిస్క్ బారినపడ్డానని, ఆ గాయం కారణంగా సుమారు 40 రోజుల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చిందని ఆమె తెలిపారు.నేహా ధూపియా, అంగద్ బేడీలు నిర్వహిస్తున్న 'డబుల్ డేట్' టాక్ షోలో తన భర్త జాకీ భగ్నానీతో కలిసి పాల్గొన్న రకుల్, ఆనాటి చేదు అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. "మీ ట్రైనర్‌లు ఏం చెప్పినా సరే, డెడ్‌లిఫ్ట్ చేయడం అనేది అత్యంత ప్రమాదకరమైన వ్యాయామం. అది కేవలం ఒక ఇగో లిఫ్ట్ మాత్రమే. ఆనాడు నేను చేసిన చిన్న పొరపాటు స్లిప్ డిస్క్‌కు దారితీసింది" అని ఆమె పేర్కొన్నారు. ఆ గాయం కారణంగా కనీసం కదలలేని స్థితికి చేరుకున్నానని, నరాల సంబంధిత సమస్యలు కూడా తలెత్తాయని ఆమె వివరించారు.ఎంతో చురుకుగా ఉండే తాను, రోజువారీ పనుల కోసం కూడా ఇతరులపై ఆధారపడాల్సి రావడం తనను మానసిక వేదనకు గురిచేసిందని రకుల్ తెలిపారు. "ఇది కేవలం శారీరక గాయమే కాదు, నన్ను మానసికంగానూ ఎంతో కృంగదీసింది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన భర్త జాకీ భగ్నానీ తనకు అండగా నిలిచి ఎంతో ధైర్యాన్ని అందించారని ఆమె పేర్కొన్నారు. 2024 ఫిబ్రవరిలో గోవా వేదికగా వివాహం చేసుకున్న ఈ జంట, తమ వైవాహిక బంధానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ఈ షోలో పంచుకున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ;   TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com